ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



అనంతపురం
జిల్లా వార్తలు

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

వంకను అమ్మేస్తున్నారు..!



వైసీపీ నాయకులు చదును చేసిన వంక స్థలం



స్థలంలో ఉన్న చెట్లను తొలగించిన దృశ్యం

ఇన్నాళ్లూ వంకలో ఉండే ఇసుకను తోడి అమ్ముకున్నారు. ఇప్పుడు ఏకంగా వంకలనే ఆక్రమించి అమ్మేస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోని ఓ వంకపై అధికార పార్టీ నాయకులు కన్నేశారు. వంలో ఉన్న పెద్ద పెద్ద చెట్లను గుట్టుచప్పుడు కాకుండా తొలగించి, భూమిని చదును చేశారు. ప్లాట్ ఇంత అని ధర కట్టి విక్రయిస్తున్నారు. అడ్వాన్స్ రూ.20 వేలు ఇస్తే చాలని, మిగిలిన సొమ్ము తరువాత ఇద్దరని బేరం పెట్టి మరీ అమ్ముతున్నారు. కురుగుంట గ్రామ సర్వే నంబరు 98-3లో ఈ వంక ఉంది. ఈ వంకకు ఆనుకుని ఉన్న భూమిపై ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒకరు కన్నేశారు. అధికార బలంతో ఎకరానికి పైగా వంక భూమిని స్థానికంగా ఉన్న ఓ వ్యక్తితో కలసి మూడు రోజుల క్రితం చదును చేయించాడు. యంత్రాల సాయంతో ఈతచెట్లను తొలగించి, వంకలో పడేశారు. క్షేత్రస్థాయిలో పాట్లు వేయకుండానే అమ్మకాలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఒక్కో ప్లాట్‌ను రూ.లక్షకు అమ్ముతున్నారని సమాచారం. ప్లాట్ కావాల్సినవారు తొలుత రూ.20 వేలు ఇవ్వాలని, పట్టాలు ఇచ్చిన తరువాత మిగిలిన సొమ్ము ఇస్తామని బేరసారాలు సాగిస్తున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. వంకను ఆక్రమించి ప్లాట్లుగా అమ్మేసుకుంటున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది. ప్రభుత్వ భూములను ఆక్రమించి, విక్రయించే హక్కు అధికార పార్టీ వారికి ఉంటుందన్నట్లు.. ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. నగరానికి కూతవేటు దూరంలో ఆక్రమణలు కొనసాగుతున్నా ఏ ఒక్క అధికారీ స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అనంతపురం రూరల్

వైసీపీకి ఓటుతో బుద్ధి చెబుదాం

టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు

అనంతలో చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర

మాట్లాడుతున్న రఘురామరాజు



అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 1: కార్మిక లోకం ఏకమై ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు పిలుపునిచ్చారు. పాతూరు బ్రహ్మంగారి ఆలయం వద్ద టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు అధ్యక్షతన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర బహిరంగ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అహంకారి జగన్‌కు.. కార్మికుల ఆత్మగౌరవానికి మధ్య యుద్ధం జరగబోతోందని అన్నారు. భవిష్యత్తులో వైసీపీ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు భయపడేలా ఈ యుద్ధంలో కార్మికులు తీర్పునివ్వాలని కోరారు. టీడీపీ హయాంలో ఉచితంగా ఇసుక ఇచ్చామని, తద్వారా భవన నిర్మాణ రంగం బాగుపడిందని, కార్మికులకు జీవన భృతి దక్కిందని అన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా చంద్రబాబు రూ.5కే కడుపు నిండా పేద వారికి అన్నం పెట్టారని గుర్తు చేశారు. అసంఘటిత కార్మికులకు బీమా సౌకర్యం కల్పించారని, చేతివృత్తుల వారికి ఆదరణ పనిముట్లు అందించి చేయూతనిచ్చారని అన్నారు. సీఎం జగన్ ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర ద్వారా ఇచ్చే డబ్బులకంటే ఎక్కువ రెట్లు పన్నులు, జరిమానాలు వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సమ్మెకు దిగిన అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించారని అన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అవినీతి వెంకటరామిరెడ్డిగా పేరు మార్చుకున్నారని విమర్శించారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు జరిగినా నిందితులపై చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

- జగన్ రాక్షస పాలనలో అన్ని వర్గాల ప్రజలు అల్లాడిపోతున్నారని టీఎన్‌టీయూసీ ఐదో జోన్ కో-ఆర్డినేటర్ అశోక్‌కుమార్ విమర్శించారు. సొంత చెల్లెలు షర్మిల జగన్ పాలనపై దుమ్మెత్తిపోస్తున్నారని అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని విభజించి పాలించాలనుకునే వైసీపీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత, మేధావులు బుద్ధి చెప్పారని అన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని జగన్ హామీ ఇచ్చి తుంగలో తొక్కారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఉద్యమాలు చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఇలాంటి వైసీపీ ప్రభుత్వాన్ని రాబోవు ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలిపేయాలన్నారు.
- వైసీపీ పాలనలో కార్మిక లోకం తీవ్రంగా నష్టపోయిందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్ అన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే కార్మిక వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు కార్మిక లోకం నడుంబిగించాలని కోరారు.
- వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి తనయుడు మధుకర్ చౌదరి అన్నారు. కార్మికులు మరింత అన్యాయానికి గురయ్యారన్నారు. సీఎం జగన్ పాలనలో ఒక్క కొత్త పరిశ్రమ స్థాపించకపోగా ఉన్న పరిశ్రమలను తరిమేశారని అన్నారు. జగన్ మాయమాటలను నమ్మకుండా, రాబోవు ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు గుర్రం నాగభూషణం, బ్యాళ్ల నాగేంద్ర, పెద్ద మారెప్ప, దళవాయి రమాదేవి, విజయశ్రీరెడ్డి, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన కార్మికులు

ఆట.. రోజా కొట్లాట..!



అధికారులను ప్రశ్నిస్తున్న క్రీడాకారులు

- అనంత నియోజకవర్గ జట్టులో స్థానికేతరులు
- అభ్యంతరం తెలిపిన శింగనమల క్రికెట్ జట్టు
- జేఎన్‌టీయూ మైదానంలో క్రీడాకారుల నిరసన
- నిబంధనలపై అధికారులలో భిన్న స్వరాలు
- డిప్యూటీ మేయర్ కోగటం జోక్యంతో ఆగిన ఆట



మైదానం నుంచి వెళ్లిపోతున్న క్రీడాకారులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 1: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల్లో వివాదాలు, గొడవలు కొనసాగుతున్నాయి. ఎన్నికలవేళ యువతను ఆకట్టుకునేందుకు వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పోటీలు గొడవలకు దారితీస్తున్నాయి. జేఎన్‌టీయూ క్రీడా మైదానంలో గురువారం శింగనమల, అనంతపురం నియోజకవర్గాల జట్ల మధ్య జరగాల్సిన క్రికెట్ మ్యాచ్‌పై వివాదం తలెత్తింది. జిల్లా స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో అనంతపురం జట్టు నిబంధనలకు విరుద్ధంగా ఇతర క్రీడాకారులతో వచ్చిందని ప్రత్యర్థి జట్టు క్రీడాకారులు అభ్యంతరం తెలిపారు. సచివాలయ పరిధిలో ఉంటున్న క్రీడాకారులే జట్టులో ఉండాలన్న నిబంధనను అనంత జట్టు పాటించలేదని శింగనమల జట్టు వాదించింది. ఈ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు డీఎస్‌డీఓ, రాష్ట్ర ఐటీశాఖ అధికారికి పీఈటీలు ఫోన్ చేశారు. సచివాలయ పరిధిలో నివాసమున్న వారే పోటీలో పాల్గొనాలని డీఎస్‌డీఓ సమాధానమివ్వగా, ఏ ప్రాంతంవారైనా పాల్గొనవచ్చని ఐటీశాఖ అధికారి జవాబిచ్చారు. అధికారులకే స్పష్టత లేకపోవడంతో వివాదం ముదిరి.. ఆట నిలిచిపోయింది.

పూటకొక నిబంధనా..?

ఒక్కో సచివాలయానికి ఒక్కో జట్టు ఉండేలా పోటీలను ప్రారంభించారు. ఆ తరువాత పోటీ పోటీకీ నిబంధనలను మార్చారు. ఇదేం తీరు అని శింగమనల జట్టు సభ్యులు ప్రశ్నించారు. పద్ధతిగా ఆడితే పాల్గొంటామని, లేదంటే వెళ్లిపోతామని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి అక్కడికి చేరుకుని, డీఎస్‌డీఓకు ఫోన్‌చేశారు. సచివాలయ పరిధిలోని వారు మాత్రమే ఆడాలని డీఎస్‌డీఓ ఆయనతో అన్నారు. అలా అని ఆర్డర్ ఇవ్వాలని కోగటం డిమాండ్ చేశారు. 'అందరూ ఎలా వచ్చారో నాకు తెలుసు. ఆడించింది నువ్వే. నువ్వే నిబంధనలు పాటించలేదు కదా..? ఆర్డర్ ఇస్తే నీపై కేసు వేస్తాను. నీకు శిక్ష తప్పదు..' అని డీఎస్‌డీఓను హెచ్చరించారు. దీంతో తానే అక్కడికి వస్తానని డీఎస్‌డీఓ బదులిచ్చారు.

స్వరం మార్చిన డీఎస్‌డీఓ

డిప్యూటీ మేయర్ ఫోన్‌కాల్‌తో జేఎన్‌టీయూ క్రీడామైదానికి చేరుకున్న డీఎస్‌డీఓ, తన స్వరాన్ని మార్చారు. ఏ ప్రాంతానికి చెందినవారైనా, ఒక సచివాలయంలో మ్యాపింగ్ చేసుకున్నాక ఆ సచివాలయ జట్టులో ఆడటానికి అర్హులని అన్నారు. దీంతో అవాక్కయిన శింగనమల జట్టు క్రీడాకారులు.. ఈ తొండి ఆటను ఆడేదిలేదని అన్నారు. ఈ వివాదం నేపథ్యంలో జేఎన్‌టీయూ మైదానంలో ఉరవకొండ-రాయదుర్గం, కళ్యాణదుర్గం-తాడిపత్రి. గుంతకల్లు-రాప్తాడు జట్ల మధ్య పోటీలు కూడా ఆలస్యమయ్యాయి. ఆయా జట్ల పీఈటీలు సర్దిచెప్పి మధ్యాహ్నం నుంచి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో కళ్యాణదుర్గం, గుంతకల్లు జట్లు విజయం సాధించాయి. సాయంత్రం కావడంతో ఉరవకొండ-రాయదుర్గం జట్ల మధ్య పోటీని శుక్రవారానికి వాయిదా వేశారు. అనంతపురం, శింగనమల జట్లు మధ్యాహ్నమే వెనుదిరాగాయి.

రాజకీయ క్రీడ

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు రాజకీయాలకు వేదికగా మారాయని శింగనమల జట్టు మండిపడింది. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ తన కుమారుడి జట్టు గెలుపుకోసం రెవెన్యూ కాలనీ పరిధిలో లేని వారిని జట్టుగా ఏర్పాటుచేశారని వారు ఆరోపించారు. పోటీ జరగకపోయినా, అనంతపురం నియోజకవర్గ జట్టును విజేతగా ప్రకటించుకున్నారని విమర్శించింది. ఆ జట్టులో ముగ్గురు మాత్రమే రెవెన్యూ కాలనీ సచివాలయ పరిధిలో నివాసం ఉన్నారని, మిగిలిన సభ్యులు నిపుణులైన ఆటగాళ్లని, వారిని వేర్వేరు ప్రాంతాల నుంచి జట్టులోకి తెచ్చి రాజకీయం చేస్తున్నారని శింగనమల జట్టు సభ్యులు అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆడటానికి తాము అంగీకరించలేదని, దీంతో వారే గెలిచినట్లు ప్రకటించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, న్యాయం చేయాలని కోరారు.



డీఎస్‌డీఓతో మాట్లాడుతున్న పీఈటీ



జేసీ ప్రభాకర్‌రెడ్డికి హారతి పడుతున్న మహిళలు

బస్సుయాత్రకు అపూర్వ స్పందన

పల్లెల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఘనస్వాగతం

యాడికి, ఫిబ్రవరి 1: మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి చేపట్టిన యువచైతన్య బస్సుయాత్రకు యాడికి మండలంలో అపూర్వ స్పందన లభించింది. మొదటిరోజు గురువారం మండలంలోని గుడిపాడు, కుందనకోట, చింతలాయపల్లి, బోయరెడ్డిపల్లి, వీరారెడ్డిపల్లి, కమలపాడు, వీరన్నపల్లి, తిరుణాంపల్లి గ్రామాల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. గ్రామగ్రామాన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ యువచైతన్య యాత్ర ముందుకు సాగింది. గుడిపాడులో 20 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కుందనకోటలో గ్రామస్థులు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. పలువురు వృద్ధులు, మహిళలతో జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చింతలాయపల్లిలో పలువురు మహిళలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ ప్రభుత్వంలో తమకు న్యాయం జరగడం లేదని, అధికారంలోకి వచ్చాక తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. బోయరెడ్డిపల్లిలో టీడీపీ జెండాలు చేతబూనిన మహిళలు యువచైతన్య బస్సుయాత్రకు ఘనస్వాగతం పలికారు. జేసీ ప్రభాకర్‌రెడ్డికి హారతి ఇచ్చి, తిలకం దిద్దారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని ఆయనను కోరారు. గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బస్సుయాత్రలో టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య తదితరులు పాల్గొన్నారు. అశ్మిత్‌రెడ్డి ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను ఆరాతీస్తూ ముందుకు సాగారు. వృద్ధులను, చిన్నారులను పలకరించి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి యువచైతన్య బస్సుయాత్రలో పాల్గొన్నారు.

పురిటి బిడ్డలకు
చూపు సమస్య



అనంతపురం టౌన్, ఫిబ్రవరి 1: జిల్లా ఆస్పత్రి ఆవరణంలో ఉన్న డీఈఐసీ కేంద్రంలో నెలలు నిండకనే పుట్టిన పసిపిల్లలకు ప్రత్యేక కంటి వైద్యనిపుణులు కంటి రెటీనా పరీక్షలు నిర్వహించారు. 19 మంది చిన్నారులకు కంటిపరీక్షలు నిర్వహించగా, ఏకంగా 13 మందికి కంటిచూపు సమస్య ఉన్నట్లు తేలిందని పర్యవేక్షణ అధికారి డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ పిల్లలకు మరో రెండుమార్లు పరీక్షలు నిర్వహిస్తామని, రెటీనా మెచ్యూరిటీ పెరగకపోతే శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శివిద్య, జ్ఞానప్రసన్న, మేనేజరు రజిత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పక్కాగా
ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం





అనంతపురం టౌన్ ఫిబ్రవరి 1: ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులకు ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. సాధారణ విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 24,446 మంది, ద్వితీయ సంవత్సరంలో 22,378 మంది ఉన్నారని, ఒకేషనల్ విద్యార్థులు 2,068 మంది ఉన్నారని డీవీఈఓ వెంకట రమణ తెలిపారు. విద్యార్థుల సందేహాలను తీర్చడం కోసం జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటర్ పరీక్షలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఎథిక్స్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 3వతేదీ ఎన్విరాన్మెంట్ పరీక్షలు నిర్వహించాలని, ప్రాక్టికల్ పరీక్షలు షెడ్యూల్ మేరకు ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించాలని ఆదేశించారు. మార్చి 1వ తేదీ నుంచి 20 వరకు థియరీ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఆ సమయంలో నిబంధనలు విధిగా పాటించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో తగిన వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్కరూ నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదని, అందరికీ బల్లలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సౌకర్యం సక్రమంగా ఉండేలా చూడాలని, పరీక్ష కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు ముగిసే వరకు బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్‌కు నర్సును ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నైట్ డ్యూటీ..!

బదిలీ తహసీల్దారు సిన్సియారిటీ

- హడావుడిగా పాసుపుస్తకాల జారీ
- ఓ వీఆర్వో ద్వారా రూ.3 లక్షల డీల్
- ఉన్నతాధికారుల మందలింపు..?



కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 1: ఇన్నాళ్లూ కార్యాలయం గురించి పెద్దగా పట్టించుకోని ఆ తహసీల్దారు.. బదిలీ నేపథ్యంలో రాత్రికి రాత్రే పనులను పూర్తి చేసేశారు. ఎలాగూ బదిలీ అవుతానని భావించి.. కొన్నాళ్లుగా కార్యాలయానికి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్లను పెద్ద ఎత్తున బదిలీ చేసింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఓ మండల తహసీల్దారు కూడా బదిలీ అయ్యారు. పోతూ పోతూ.. రూ.3 లక్షలకు డీల్ కుదుర్చుకుని, బుధవారం రాత్రికి రాత్రే కొందరికి పట్టాదారు పాసుపుస్తకాలు చేసి ఇచ్చారని సమాచారం. ఈ డీల్ నేపథ్యంలో రాత్రి కార్యాలయంలోనే ఉండాలని కంప్యూటర్ ఆపరేటర్‌కు ముందుగానే సమాచారం ఇచ్చారని తెలిసింది. మండల కేంద్రానికి చెందిన ఓ వీఆర్వో ద్వారా ఈ డీల్ కుదిరినట్లు తెలిసింది. కేవలం ముగ్గురు మాత్రమే కంప్యూటర్ ఆపరేటర్ గదిలోకి వెళ్లి, కార్యాలయం బయట తలుపులు వేసి మరీ పనిని ముగించేశారు. అప్పటికే ఎంపిక చేసుకున్న పేర్లతో పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేసినట్లు తెలిసింది.



కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం

అనుకున్నదే తడవుగా..

ఒక పట్టాదారు పాసుపుస్తకం జారీ చేయాలంటే వీఆర్‌వో, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దారు, తహసీల్దారు సంతకాలతో కూడిన ఓ ఫైల్ ఉండాలి. ఇంత తతంగం పూర్తి అయ్యాక, విచారించిన అనంతరమే పట్టాదారు పాసుపుస్తకాన్ని జారీ చేస్తారు. ఈ నిబంధనలు ఏవీ పాటించకుండా, ఒకే ఒక్క వీఆర్‌వోను పక్కన పెట్టుకుని, డిజిటల్ కీ ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేశారని సమారాచం. ఈ విషయాన్ని అక్కడే ఉన్న ఓ వ్యక్తి ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఆ ఉన్నతాధికారి వెంటనే తహసీల్దారుకు ఫోన్ చేసి మందలించినట్లు తెలిసింది. దీంతో తహసీల్దారు డిజిటల్ కీ తీసుకుని కంగారుపడుతూ తన వాహనంలో వేగంగా వెళ్లిపోయారు.

ఇంతకీ ఏం చేశారు..?

బదిలీ అయిన తహసీల్దారు రాత్రి కార్యాలయానికి రావడం అనుమానాలకు తావిస్తోంది. పట్టా భూములకు పాసు పుస్తకాలు చేశారా? లేక డి -పట్టా భూములను మ్యుటేషన్ చేశారా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. డి-పట్టా భూముల మ్యుటేషన్‌కు ప్రభుత్వ అనుమతులు లేవని ఇన్నాళ్లుగా నెట్టుకొచ్చిన ఆ తహసీల్దారు.. ఇప్పుడు వాటికే పాసు పుస్తకాలు మంజూరు చేశారని కొందరు ఆరోపిస్తున్నారు.

గతంలోనూ వివాదాలు

పాసుపుస్తకాల విషయంలో తహసీల్దారు అడ్డగోలుగా వ్యవహరించారని కార్యాలయ సిబ్బంది అంటున్నారు. గతంలోనూ ఈ వ్యవహారం రచ్చకెక్కింది. పట్టాదారు పాసుపుస్తకాల అడ్డగోలు వ్యవహారాలపై తహసీల్దారు, ఆర్ఐ పలుమార్లు కార్యాలయంలోనే వాగ్వాదానికి దిగారని, దూషించుకున్నారని ఆ కార్యాలయ వర్గాలు అంటున్నాయి. అక్రమాల కారణంగా వెబ్ ల్యాండ్ అంతా అస్తవ్యస్తంగా మారిపోయిందని సమాచారం. తహసీల్దారు కార్యాలయం వేదికగా లక్షలాది రూపాయలు చేతులు మారాయని ఆరోపణలు ఉన్నాయి. అర్హులకు పట్టాదారు పాసుపుస్తకాలు చేయాలంటే సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు, ఇలా అడ్డగోలు వ్యహారాలకు రాత్రిళ్లూ పని చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దారు కార్యాలయంలో రాత్రికి రాత్రి జరిగిన తంతుపై కలెక్టర్ స్పందించి.. విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

బండి భరోసా లేదు

● రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి ● కొత్త రైళ్లు, ప్రాజెక్టులు నిల్
● రైల్వే ఉద్యోగులకు తీవ్ర నిరాశ ● డబ్లింగ్, ట్రాక్ పనులకు అరకొర నిధులు



బడ్జెట్‌లో రైల్వే కేటాయింపులపై మాట్లాడుతున్న డీఆర్ఎం వినీత్ సింగ్

గుంతకల్లు, ఫిబ్రవరి1: రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయే మిగిలింది. కొత్త రైళ్ల ఊసులేదు. ఉద్యోగులు, కార్మికులకు వరాలు లేవు. కొత్త ప్రాజెక్టులు అసలే లేవు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్‌లో రైల్వే శాఖకు నిరాశే మిగిల్చింది. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో అనూహ్యమైన ప్రకటనలేవీ ఉండకపోవచ్చని ముందే భావించినా, కనీసం తాయిలాలన్నా ఉంటాయని ఆశించిన రైల్వే ఉద్యోగులకు నిరాశే మిగిలింది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో సరుకు రవాణాకు అనుకూలంగా రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై తప్ప ఇతరాత్రా ప్రయోజనాలేవి కలిగించలేదు. మొత్తానికి ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన బడ్జెట్టులో రైల్వే శాఖకు మొండి చేయి దక్కిందన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.

డబ్లింగ్‌కు పెద్దపీట

సరుకు రవాణా ద్వారా రైల్వేకు పెంపొందించడానికి అనుకూలంగా ఈ రైల్వే బడ్జెట్‌లో లైన్ల డబ్లింగ్, ట్రిపులింగ్‌లకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. రైల్వే డివిజన్‌లోని గూడూరు-రేణిగుంట, రేణిగుంట-తిరుపతి సెక్షన్లలో అదనపు లైన్ కోసం బడ్జెట్‌లో రూ. 5.50 కోట్లను కేటాయించారు. గుత్తి బైపాస్‌లైన్, ధర్మవరం-పాకాల-కాట్పాడి సెక్షన్‌లో డబ్లింగ్ కోసం, అకోలా-డోన్ లైన్ డబ్లింగ్‌కు అరకొరగా నిధులను కేటాయించారు. గుత్తి-పెండేకల్లు లైన్ డబ్లింగ్‌కు రూ. 150 కోట్లు, గుంతకల్లు-మల్లప్పగేట్ బైపాస్ లైన్ డబ్లింగ్‌కు 20 కోట్లు కేటాయించారు. గుత్తి-ధర్మవరం, కల్లూరు-గుంతకల్లు లైన్ల అభివృద్ధికి తక్కువ పరిమాణంలో నిధులను కేటాయించారు.

కొత్తలైన్లకు నిధులు

నంద్యాల-ఎర్రగుంట్ల, కడప-బెంగళూరు, నడికుడి-శ్రీకాళహస్తి లైన్ల నిర్మాణానికి నిధులను ఇచ్చారు. అలాగే కంబం-ప్రొద్దుటూరు మధ్య 125 కి.మీ.ల లైన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోనూ, గుత్తిలోని మూడు ప్లాట్‌ఫారాల అనుసంధానానికి నిధులను కేటాయించారు. ధర్మవరం స్టేషన్‌లో 6వ ప్లాట్‌ఫారం అభివృద్ధికి నిధులు కేటాయించారు. డివిజన్‌లోని 100 లెవెల్ క్రాసింగ్‌లకు విద్యుద్దీకరణకు, తిరుపతి-రేణిగుంట-గూడూరు సెక్షన్‌లోని 94 లెవెల్ క్రాసింగ్‌లకు నిధులను కేటాయించారు. గుంతకల్లు-హైదరాబాదు, గుంతకల్లు-సికింద్రాబాదు రూట్లలోని లెవెల్ క్రా సింగ్‌లకు ఇంటర్లాకింగ్ పనులకు నిధులు కేటాయిం చారు. గుంతకల్లు డివిజన్‌లో 95 టాయిలెట్లు, నీటి వసతి ఏర్పాటుకు ఫండ్స్ ఇచ్చారు. గుంతకల్లులోని ఎలెక్ట్రికల్ లోకో షెడ్ పూర్తికి రూ. 4.8 కోట్ల నిధులను కేటాయించారు. గుంతకల్లు డీజల్ షెడ్‌లో హైపవర్ లోకోల మరమ్మత్తు స్థాయిని 50 లోకోలకు పెంచడానికి నిర్ణయించారు.

అసంతృప్తిలో ఉద్యోగులు

కేంద్ర బడ్జెట్‌లో తమకు ఏదైనా తీపికబురు ఎదురౌతుందని ఆశించిన రైల్వే ఉద్యోగులకు తీవ్ర నిరాశే ఎదురైంది. ఓపీఎస్ విషయంపై ఎటువంటి ఊసూ లేకపోవడం, 8వ పే రివిజన్ కమిషన్ విషయంగా ఎటువంటి ప్రకటన చేయకపోవడం, ఇతర ప్రయోజనాలకు సంబంధించి కూడా ఎటువంటి చర్చ లేకపోవడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. రైల్వేలో ఖాళీలు, పెరిగిన రైళ్లకు అనుగుణంగా పెంచాల్సిన ఉద్యోగాల విషయంపై బడ్జెట్‌లో ప్రకటన లేకపోవడంపై కార్మిక సంఘాలు నిరసనను వ్యక్తం చేస్తున్నాయి. క నీసం ఎన్నికల ముందైనా తమ కష్టాలు తీరేలా వరాలు ప్రసాదిస్తారని భావించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది. వరుసగా రెండో ఏడాదీ ఉద్యోగులకు మొండి చేయే మిగిలింది. రైల్వే పింక్ బుక్ వెలువడిన తర్వాత సునిశితంగా పరిశీలించి రైల్వే డివిజన్‌కు ఎన్ని కోట్ల కేటాయింపులు జరిగాయో ప్రకటిస్తామని గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్ పేర్కొన్నారు.

కాసింతే ఊరట..!



● వెనుకబడిన జిల్లా ప్యాకేజీ లేదు
● సెంట్రల్ వర్సిటీకి నిధులు లేవు
● వేతన జీవులకూ తప్పని నిరాశ
● రైతాంగానికి సబ్సిడీ నానో డీఏపీ
● గృహాలకు ఉచిత సోలార్ విద్యుత్

అనంతపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు పిసరంత ఊరట మాత్రమే దక్కింది. రైతాంగం పట్ల కనికరం చూపలేదు. రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అమలు చేస్తామని ప్రకటించారేగాని.. బడ్జెట్‌లో ఊసు లేదు. రైతులకు సబ్సిడీతో నానో డీఏపీ ఇస్తామని ప్రకటించడం ఊరట. ఉమ్మడి జిల్లాలో కూలీలకు ఎంతగానో ఉపయోగపడుతున్న ఉపాధి పథకానికికి బడ్జెట్‌లో అరకొర కేటాయింపులే జరిగాయి. విభజన హామీలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన సెంట్రల్ యూనివర్శిటీకి నిధులు కేటాయింపు పట్ల కేంద్రం చొరవ చూపలేదు. ఇప్పటికీ సెంట్రల్ యూనివర్శిటీ ప్రహరీకే పరిమితమైంది. వేతన జీవులు ఆశించిన ఆదాయ పన్ను మినహాయింపు పెరగలేదు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ రూపొందించారని రాజకీయ విశ్లేషకులు, మేధావులు వ్యాఖ్యానించారు. సోలార్ విద్యుత్ 300 యూనిట్ల వరకూ (ఇళ్లపై ఏర్పాటు) ఉచితంగా ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించడమే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఆయూష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవల వర్తింపు ఆ వర్గాలకు కొంత ఉపశమనం కలిగిస్తుంది. మధ్యతరగతి ప్రజలు సొంత గృహాలను కొనుగోలు చేసేందుకు, నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'హౌసింగ్ ఫర్ మిడిల్‌క్లాస్' పథకాన్ని ప్రారంభించేందుకు బడ్జెట్‌లో రూపకల్పన చేశారు.

వైసీపీ వైఫల్యం..



రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయింది. విభజన హామీలకు సంబంధించి బడ్జెట్‌లో నిధులు సాధించుకోవడంలో వైసీపీ ఘోరంగా విఫలమైంది. పోలవరం ప్రాజెక్టుకు నిధులు సాధించుకోవడంలోనూ, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తహా ప్యాకేజీ పొందడంలోనూ వైఫల్యాన్ని చాటుకుంది. బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో... సీఎం జగన్ తన పార్టీ ఎంపీలతో సమావేశం నిర్వహించి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సింది. కానీ పట్టించుకోలేదు. ప్రత్యేక హోదా మాటను పూర్తిగా మరిచిపోయారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టుపెట్టారనడానికి బడ్జెట్‌లో కేటాయింపులే నిదర్శనం.

- కాలవ శ్రీనివాసులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు

రిక్తహస్తమే..



లోకసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్ ఇది. ప్రజల ఆశలను వమ్ము చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. పెద్దగా కేటాయింపులు లేవు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా నిధులు కేటాయింపులున్నాయి. విభజన హామీలు అమలుకు బడ్జెట్‌లో నిధులు ఇవ్వలేదు. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఊసే ఎత్తలేదు. అన్ని వర్గాల ప్రజలను ఈ బడ్జెట్ నిరాశపరిచింది.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

వెనుకబడిన ప్రాంతాలకు మోసం...



వెనుకబడిన ప్రాంతాలకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర బడ్జెలో లేవు. ఆ వర్గాలను మోసం చేసే బడ్జెట్ ఇది. బీజేపీ నాయకులు రాయలసీమ డిక్లరేషన్, రాయలసీ గర్జన అంటూ ఇక్కడ రంకెలు వేస్తుంటారు. కానీ ఢిల్లీ బీజేపీ నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి చిల్లిగవ్వ ఇవ్వడం లేదు. విభజన చట్టం హామీల్లో భాగంగా రాష్ట్రంలోని ఏడు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కో జిల్లాకు రూ. 50 కోట్లు మూడు సంవత్సరాలు మాత్రమే ఇచ్చి నిలిపివేసింది. ఎనిమిది సంవత్సరాల క్రితం జిల్లాలో శంకుస్థాపన చేసిన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇప్పటికీ ప్రహరీ గోడలు, పునాదులకే పరిమితమైంది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పనులు నత్తతో పోటీపడుతున్నాయి. ఆ డివిజన్‌ను బలహీనపరిచే చర్యలు అమలవుతున్నాయి. కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్ల గురించి ప్రస్తావనే లేదు. రాయలసీమ జిల్లాలో నెలకొల్పాల్సి కేంద్ర సంస్థలు, అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసిన్, టెక్స్‌టైల్స్ పార్కు, కడపలో ఉక్కు పరిశ్రమ, కర్నూలో రూ. 400 కోట్లతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్ వంటి హామీలలో బీజేపీ ఒక్కటీ పూర్తి చేయలేదు. ఈ బడ్జెట్‌లో 99 శాతం ప్రజలకు ఎలాంటి ఉపశమనం లేదు. బడా కార్పొరేట్లకు వికాసం, సామాన్యులకు విషాదం మిగిలింది. నిరుద్యోగులకి తీవ్ర అన్యాయం జరిగింది. ధరల పెంపుదలతో ప్రజలపై భారాలు పెరిగాయి. ప్రభుత్వ ఆస్తుల్ని, ప్రజల ఆస్తుల్ని అంబానీ, అదానిలాంటి బడా కార్పొరేట్లకు కట్టబెట్టడంలో ఈ ప్రభుత్వం జయప్రదమైంది. అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి, అణచడానికి మతాన్ని అడ్డంగా పెట్టుకొని రామనామస్మరణతో ప్రజల్ని మాయ చేయాలని చూస్తున్నారు.

- రాంభూపాల్, జిల్లా కార్యదర్శి, సీపీఎం

పరిశోధన విద్యకు పెద్దపీట



దేశప్రగతికి మూలమైన పరిశోధన, సృజనాత్మక విద్యకు కేంద్ర బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించారు. యువత, మహిళలకు ముద్రాయోజన, స్టార్టప్‌లతో ఉద్యోగాలు, రైతులకు బీమా సౌకర్యం, ఆర్థిక సాయం, పాడి రైతులకు ప్రోత్సాహకం, రైల్వే కారిడార్‌లు, ఇళ్ల నిర్మాణాలు.. ఇలా అన్ని రంగాలను సమన్వయం చేస్తూ నిధులు కేటాయించారు. ఇవి ఆర్థికాభివృద్ధికి సూచికలు. అన్ని వర్గాల ప్రజల సగటు ఆదాయం పెంచుకునేలా ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం హర్షణీయం.

- సాకే శివశంకర్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రైతాంగానికి నిరాశ..



సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలను, రైతాంగాన్ని ఈ బడ్జెట్ నిరాశపరిచింది. ఏ వర్గానికీ ప్రయోజనం చేకూరేదిగా లేదు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారు. చేనేత రంగా న్ని నిర్లక్ష్యం చేశారు. కార్పొరేట్ శక్తులకు మరింత ఎదగడానికి ఊతమిచ్చేలా బడ్జెట్ రూపొందించారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఊసెత్తలేదు.

- బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు


కరువు జిల్లాపై వివక్ష..



కరువు జిల్లాపై కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపుతోంది. విభజన హక్కులను సాధించుకోవడంలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యం కొనసాగింది. అత్యంత వెనుకబడిన జిల్లాకు నిధులను సాధించుకోవాలన్న చిత్తశుద్ధి జగన్ ప్రభుత్వానికి లేకుండాపోయింది.


- భవానీ రవికుమార్, జనసేన కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

కర్నూలు కార్పొరేటర్‌కు నింబగల్లులో ఓటు


నింబగల్లులో నమోదైన కర్నూల్ కార్పొరేటర్ ఓటు

ఉరవకొండ, ఫిబ్రవరి 1: కర్నూలు మున్సిపల్ కార్పొరేటర్ అయిన కృష్ణకాంత్ సోంపల్లికి అధికారులు నింబగల్లులో ఓటు హక్కు కల్పించారు. గ్రామంలోని 147వ పోలింగ్ కేంద్రంలో అతనితో పాటు, అతని కుటుంబ సభ్యులకూ ఓట్లు నమోదు అయ్యాయి. ఆయన గ్రామాన్ని వదిలి వెళ్లి 15 ఏళ్లు అవుతున్నా వాటిని తొలగించకపోవడం చర్చనీయాంశమయ్యింది. కర్నూలు పట్టణం లోని 44వ పోలింగ్ కేంద్రంలోనూ అతనికి ఓటు ఉంది. ప్రజా ప్రతినిధి అయిఉండి, రెండు చోట్ల ఓట్లు నమో దు చేసుకోవడంపై పలువురు మండిపడుతున్నారు. బీఎల్‌ఓపై చర్యలు తీసుకోవాలని పలు పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామంలో ఉన్నా.. తొలగించారు



తొలగించిన ఓటు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో నివాసముంటున్నా ఓటును తొలగించారని వండ్రక్క కుటుంబ సభ్యులు ఆరోపి స్తున్నారు. 98వ పోలింగ్ కేంద్రంలో వండ్రక్కకు ఓటు హక్కును కల్పించారు. అయితే అధికారులు ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదని వారు మండిపడ్డారు. ప్రతి ఎన్నికల్లోనూ ఆమె ఓటు వేసిందని, గ్రామంలో ఉండగానే ఓటును తొలగించడంపై వారు ఆగ్రహం చేస్తున్నారు.

తప్పుల తడకగా తుది ఓటరు జాబితా

ముదిగుబ్బ : గత మూడు, నాలుగు నెలల నుంచి ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, ఇంటింటా సర్వేలు నిర్వహించి ఓటరు జాబితాలో తప్పులు సరిచేశామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఎటువంటి మార్పు జరగలేదని ఇటీవలే విడుదలైన ఓటరు తుది జాబితాతో స్పష్టమవుతోంది. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలని రాజకీయ పార్టీల నాయకులు బీఎల్వోలతో పాటు తహసీల్దార్‌కు పలుమార్లు ఫర్యాదు చేసినా.. కొత్త జాబితాలోనూ తిరిగి అవే తప్పులు దొర్లుతున్నాయి. తుది జాబితాలో మండల కేంద్రంలోని 68వ పోలింగ్ కేంద్రంలో ఖాశీం కల్లూరి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అదే పోలింగ్‌కేంద్రంలో ఈరూరి చిన్న ముస్కిన్ కూడా గత ఏడాది మృతి చెందాడు. అయితే వారి ఓట్లు ఓటరు జాబితాలో తొలగి పోలేదు. ఇవే కాకుండా 68వ బూత్‌లో దాదాపు10 ఓట్లు వరకు మరణించిన వారివి ఉన్నాయని రాజకీయ పార్టీల నాయకులు వాపోతున్నారు.

ఏసీబీ వలలో విద్యుత్‌శాఖ ఏఈ


ఏసీబీ అధికారులకు పట్టుబడిన విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ (కూర్చున్న వ్యక్తి)

గుత్తి, ఫిబ్రవరి 1: వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చేందుకు లంచం తీసుకున్న విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వజ్రకూరు మండలం చాబాల గ్రామానికి చెందిన రైతు ఆనంద్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలంటే రూ.30 వేలు లంచం ఇవ్వాలని ఏఈ చంద్రశేఖర్ డిమాండ్ చేశాడు. దీంతో రూ.20 వేలు ఇచ్చేందుకు రైతు ఒప్పుకుని, ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు ఏఈ చంద్రశేఖర్‌కు గురువారం ఫోన్ చేశాడు. గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్నానని, అక్కడికి వచ్చి లంచం డబ్బులు ఇవ్వాలని ఏఈ సూచించాడు. గుత్తి బస్టాండులో రైతు ఆనంద్ ఏఈకి డబ్బులు ఇవ్వగానే ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏఈ చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని గుత్తి ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు. దాడులలో ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐ ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో 'అనంత' హవా

● విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1: దక్షిణ భారత దేశ విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో అనంతపురం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడలోని విశ్వేశ్వరయ్య మ్యూజియం, రాష్ట్ర విద్యాశాఖ సంయుక్తంగా గత నెల 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సైన్స్ ఫెయిర్‌లో సౌత్ ఇండియా నుంచి ఆరు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా నాలుగు ప్రాజెక్టులు పాల్గొనగా రెండు ప్రాజక్టులకు 4వ స్థానం, మరో 2 ప్రాజెక్టులకు ప్రత్యేక బహుమతులు వచ్చాయి. బుధవారం వాటికి సంబంధించిన ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఇతర ప్రముఖుల నుంచి విద్యార్థులు, టీచర్లు బహుమతులు, జ్ఞాపికలను అందుకున్నారు. గుత్తికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థులు జెన్నీ, మహేంద్రరెడ్డి గైడ్ టీచర్ శామ్యూల్ ప్రతాప్ సహాయంతో తయారు చేసిన "కవచ్ అండ్ రైల్వే లైట్స్ విత్ బ్లూటూత్" అన్న ప్రాజక్టు గ్రూప్ విభాగంలో, కసాపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి హేమసాగర్ తన గైడ్ టీచర్ నారాయణ సహాయంతో తయారు చేసిన "జామెట్రీ డ్రివెన్ ఎకో టాయిలెట్" అన్న ప్రాజెక్టు 4వ స్థానంలో నిలిచి సత్తా చాటినట్లు తెలిపారు. అదేవిధంగా కరుట్లపల్లి జడ్పీహైస్కూల్‌కు చెందిన టీచర్ మహమ్మద్‌రఫీకి టీచర్ కేటగిరీలో, పుట్లూరు జడ్పీహైస్కూల్ 9వ తరగతి విద్యార్థి అనూహ్యరెడ్డి తన గైడ్ టీచర్ రాజేశ్వరి సహకారంతో విద్యార్థి కేటగిరీలో స్పెషల్ ప్రైజ్‌లు పొందారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రతిభను ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు అభినందించారు.



డీఎస్పీల బదిలీ

అనంతపురం క్రైం/ పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 1: అనంతపురం డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి బదిలీ అయ్యారు. బుధవారం అర్థరాత్రి రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డిని మదనపల్లి డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మార్కాపురం డీఎస్పీగా విధుల్లో ఉన్న జి.వీర రాఘవరెడ్డిని నియమించారు.
● శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ డీఎస్పీ జి.హుస్సేన్ పీరాను 'అప్పా' డీఎస్పీగా నియమిస్తూ, పీటీసీకి అటాచ్ చేశారు. గుంతకల్లు డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న జి.శివ భాస్కర్‌రెడ్డిని నియమించారు. తూర్పుగోదావరి జిల్లాలో సెబ్ అండ్ డీసీఆర్బీలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులును దిశ శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులిచ్చారు. గుంతకల్లు డీఎస్పీ నరసింగప్పను ఎక్కడికీ బదిలీ చేయలేదు.

పలువురు ఎస్ఐలు వీఆర్‌కు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1: జిల్లాలో పలువురు ఎస్ఐలను వేకెన్సీ రిజర్వ్‌డ్(వీఆర్)కు పంపుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఐదుమంది ఎస్ఐలను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ పరిధిలోకి వీఆర్‌కు తీసుకెళ్లారు. అనంతపురం వన్‌టౌన్ ఎస్ఐ పి.వెంకటేశ్వర్లు, అనంతపురం ట్రాఫిక్ ఎస్ఐలు కె.ధరణిబాబు, జి.దిలీప్‌కుమార్, కూడేరు యూపీఎస్ ఎస్ఐ ఎస్.సత్యనారాయణ, దిశ మహిళా పీఎస్ ఎస్ఐ జి.సుధాకర్ యాదవ్‌లను వీఆర్‌కు పంపారు.

సిమెంట్ బస్తాల ఐచర్ వాహనం మాయం

నగరంలోని బళ్లారి బైపాస్‌లో 250సిమెంట్ బస్తాలున్న ఐచర్ వాహనం మాయమైంది. కొన్ని గంటల వ్యవధిలోనే ఆ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు రామ్మోహన్ అనే ఐచర్ వాహన యజమాని, డ్రైవర్ గురువారం ఉదయం తాడిపత్రి నుంచి ఐచర్‌లో 250ప్యాకెట్ల సిమెంట్ బస్తాల లోడుతో అనంతపురం వచ్చాడు. బళ్లారి బైపాస్‌లో వాహనం ఆపి హమాలీల కోసం వాహనం దిగి ముందుకెళ్లాడు. అదనుచూసిన దొంగ ఆ వాహనంలోకి ఎక్కి పరారయ్యాడు. బాధితుడు నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిమా ఉంచి మిగిలిన పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. కొన్ని గంటల్లోనే పెద్దవడుగూరు సమీపంలో పోలీసులకు ఆ దొంగ వాహనంతో పాటు అడ్డంగా దొరికిపోయాడు. ఆరా తీస్తే వాహనం తీసుకెళ్లిన వ్యక్తి గుత్తికి చెందిన భాస్కర్‌గా తేలింది.

ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా రాంబాబు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 1: అమలాపురం ఎక్సైజ్ ఏఈఎస్‌గా పనిచేస్తున్న రాంబాబుకు ఉద్యోగోన్నతి కల్పించి నగరంలోని ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా నియమించారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఎంఎల్ డిపోలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెంట్ హోదాలో పనిచేస్తున్న రామమోహన్‌రెడ్డికి ఇటీవల ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఆయన్ను నంద్యాల సెబ్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.



దెబ్బతిన్న కలెక్టర్ వాహనం

కలెక్టరు కారును ఢీకొన్న ఆటో

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 1: శ్రీసత్యసాయి జిల్లాకేంద్రంలోని సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద కలెక్టర్ వాహనాన్ని ఆటో ఢీకొంది. గురువారం సాయంత్రం కలెక్టర్ అరుణ్‌బాబు తన క్యాంపు కార్యాలయానికి కారులో వెళ్తుండగా.. వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. దీంతో కారు కుడివైపు భాగం పాక్షికంగా దెబ్బతింది. కలెక్టర్ వాహన డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ మోహన్ నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ కొండారెడ్డి తెలిపారు.

నేటి నుంచి హంపి ఉత్సవాలు

ప్రారంభించనున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్య

హోస్పేట/బళ్లారి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధిచెందిన కర్ణాటకలోని హంపి ఉత్సవాలు ఈ నెల 2వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. ఈ ఉత్సవాలను సుమారు రూ. 14 కోట్ల వ్యయంతో నిర్వహించనున్నారు. ఉత్సవాలను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య శుక్రవారం ప్రధాన వేదిక నుంచి ప్రారంభించనున్నారు. ఉత్సవాలకు మొత్తం నాలుగు వేదికలను ఏర్పాటు చేశారు. ఎదురు బసవన్న, కడ్లే గణపతి, వారాల మండపం తదితర ప్రధాన వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. తొలి రోజు సిద్దరామయ్య ప్రధాన వేదికను ప్రారంభించి, ప్రసంగిస్తారు. వేడుకల నేపథ్యంలో హంపి అంతటా సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ కాంతులతో పట్టణం వెలిగిపోతోంది. గురువారం సాయంత్రం వసంత ఉత్సవాలు జరిగాయి. హెలికాప్టర్ బైస్లైను కూడా ప్రారంభించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు, కళాకారులతో హంపి కిటకిటలాడుతోంది. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ దివాకర్ తెలిపారు.


హంపిలో సిద్ధమైన వేదిక

మాచయ్య ఆలయం నిర్మిస్తాం

- టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్



మాచయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 1: రజకుల మూల పురుషుడు మాచయ్యకు ఆలయం నిర్మిస్తామని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అరవిందనగర్‌లోని తన నివాసంలో రజకకులస్థుల ఆధ్వర్యంలో మాచయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రజక కులస్థులు మాలింత నారాయణస్వామి, కక్కలపల్లి నారాయణస్వామి, పూలకోట దస్తగిరి, చిన్నికృష్ణ, నాగేంద్ర, రాము, ఈశ్వర్ పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో...

అనంతపురం అర్బన్: రజకుల మూలపురుషుడు మాచయ్యకు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి తనయుడు మధుకర్ చౌదరి ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో మాచయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దేవళ్ల మురళీ, సరిపూటి రమణ, సుధాకర్ నాయుడు, రమేష్ బాబు, శోభ, వెంకటేష్, పరమేష్, ఈశ్వర్, శంకర్, శీన తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న మధుకర్ చౌదరి, టీడీపీ నాయకులు

సమష్టిగా పనిచేసి సమరశంఖం పూరిద్దాం

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్



మాట్లాడుతున్న వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 1: రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ నాయకులు సమష్టితా పనిచేసి సమర శంఖాన్ని పూరిద్దామని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఆ పార్టీ కార్యాలయంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు జనసేన, టీడీపీ ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. సమస్యలను తెలుసుకొని అన్ని విధాలుగా జనసేన అండగా ఉంటుందని భరోసా కల్పించాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, అఖిలభారత చిరంజీవి యువత అధ్యక్షుడు ఏపీ చలపతి, నాయకులు రహీం బాష, ఆకుల అశోక్, తిమ్మప్ప, రాము, నాగరాజు, చంద్ర, బోయ చంద్రశేఖర్, వీర మహిళలు లలిత, అరుణ, అంజలి, వర్షిత తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఓట్లతో గద్దెనెక్కాలని చూస్తున్నారు

జనసేన రాయలసీమ రీజినల్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత



మహిళలతో మాట్లాడుతున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 1: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే నకిలీ ఓట్లతో మరోసారి గద్దెనెక్కాలని ప్రయత్నం చేస్తున్నారని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. గురువారం మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా 23వ డివిజన్ విన్సెంట్ ఫెర్రర్ కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే ఓటమిని చవిచూడక తప్పదన్నారు. ఈసారి వైసీపీని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు బ్యాంకుగా వాడుకుంటే బుద్ధి చెప్తాం

ముస్లిం, మైనార్టీల ధర్నాలో ప్రజాసంఘాల వార్నింగ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 1: ముస్లిం, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకోవాలనే సరైన బుద్ధి చెప్తామని ప్రజాసంఘాల నాయకులు రాజకీయ పార్టీలను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ముస్లిం, మైనార్టీలు, ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఐఎంఎంఎ బాషా, టిప్పు సుల్తాన్ ఆర్గనైజేషన్ జాకీర్, అమ్మ అసోసియేషన్ షేక్షావలి, ముక్తియార్, షఫి జైబున్నీ, జహంగీర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతజిల్లాలో రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాలను ప్రధాన పార్టీలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, మధు, మాధవ్, శేఖర్, రజాక్, కుళ్లాయప్ప, ఇమాముల్, రియాజ్, నల్లారి రమేష్, మసూద్, మాధవ యాదవ్, జయరాం నాయక్, కేశవ్‌రాయల్, పరమేష్, మహిళలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పలు జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పలు జట్లు విజయం సాధించాయి. గురువారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో మహిళల జిల్లా క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో అనంతపురం, తాడిపత్రి టౌన్, ఉరవకొండ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఖో-ఖోలో ప్రథమస్థానంలో రాయదుర్గం, ఉరవకొండ ద్వితీయ స్థానం, అనంతపురం తృతీయ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీ పోటీల్లో అనంతపురం విజేతగా, రాప్తాడు రెండో స్థానం, గుంతకల్లు మూడో స్థానంలో నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో గుంతకల్లు మొదటి స్థానం, అనంతపురం రెండో స్థానం, రాయదుర్గం తృతీయ స్థానం దక్కించుకున్నాయి.

'పార్టీ బలోపేతమే లక్ష్యం'

శింగనమల, ఫిబ్రవరి 1: గ్రామాల్లో పార్టీ బలోపేతమే లక్ష్యం అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి అన్నారు. గురువారం మండలంలోని ఇరువెందల, మట్లగొంది గ్రామాల్లో సీపీఐ నూతన గ్రామ కమిటీలను నియమించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారప్ప, నేసేమధు, బయన్న పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గార్లదిన్నె, ఫిబ్రవరి 1: మండల పరిధిలోని ఎం కొత్తూరు గ్రామంలో వెన్నెముక సమస్యతో బాధపడుతున్న హరిజన బుజ్జన్నను గురువారం ముంటిమడుగు కేశవరెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. రూ. పదివేల ఆర్థికసాయాన్ని టీడీపీ నాయకుల ద్వారా అందజేశారు.

రాష్ట్రంలో అధ్వాన పరిస్థితులు

మాజీ మంత్రి పరిటాల సునీత



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 1: రాష్ట్రంలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. గురువారం మండలంలోని రాచానపపల్లి పంచాయతీ పరిధిలోని రాచానపల్లి, బీఎస్ఆర్‌కాలనీ, ఎస్సీకాలనీ, దోబీ కాలనీ, పరిటాల రవీంద్ర కాలనీల్లో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే హడావుడి చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. రాప్తాడులో అరాచకాలకు అడ్డుకట్ట వేసి అభివృద్ధి జరగాలంటే టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, ఏంపీపీ మాధవి, మండల ప్రధానకార్యదర్శి పామురాయి రఘు, మాజీ కాపుకార్పొరేషన్ డైరెక్టర్ పామురాయి వెంకటేష్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, యాలేటి గోపాల్, ఆదినారాయణ, తెలుగు మహిళల రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మిదేవి, సత్యసాయిజిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

రేపు జయహో బీసీ

రాప్తాడు/ఆత్మకూరు, ఫిబ్రవరి 1: స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జయహో బీసీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి పరిటాల సునీత హాజరుకానున్నానన్నారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఆత్మకూరులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

అనంతపురంరూరల్: మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరినగర్‌కు చెందిన పలువురు వైసీపీ శ్రేణులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో పార్టీలోకి చేరారు. వడ్డే మారుతీ, వడ్డే కుళ్లాయప్ప, విజయ్‌కుమార్, శేఖర్ తదితరులు పార్టీలోకి చేరినవారిలో ఉన్నారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చల్లాజయకృష్ణ, మాజీ స్టోర్ డీలర్ నాగభూషణచౌదరి, నాయకులు రంగనాయకులు, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ధర్మవరంరూరల్: మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ప్యాదిండి ఈశ్వర్‌రెడ్డి వేపచెట్టు నుంచి కిందపడి బెంగుళూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఇటీవల మృతిచెందాడు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి పరిటాల సునీత గురువారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలోని పోతన్న అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కన్వీనర్ యాతంపోతలయ్య, నరేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, దేవరాజు, రామచంద్రరెడ్డి, దామోదర్‌రెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మీరెడ్డి, నాగేంద్ర, మల్లి, సుబ్రహ్మణ్యం మాజీ మంత్రి వెంట ఉన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ప్రసన్నాయపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఎజ్జే చెన్నప్ప(58) గుండెపోటుతో గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాలసునీత గ్రామానికి వెళ్లి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, బీసీసెల్ అధికార ప్రతినిధి ఎజ్జే శంకర్, కేసీ పెద్దన్న, రమణ తదితరులు ఉన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, ఫిబ్రవరి 1: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి సూచించారు. గురువారం రామదాసుపేట సమీపంలోని ఆయన గెస్ట్ హౌసులో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలు, బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ తదితర వాటికి సంబంధించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ ట్రైనర్ ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి గుర్రం శీనా, క్లస్టర్ ఇన్‌చార్జిలు అంజినేయులు, ఆవుల శ్రీనివాసులు, టీఎస్‌టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి బాబయ్య, తెలుగుయువత జిల్లా కార్యదర్శి జగదీష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడును సీఎం చేద్దాం

ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు



శిక్షణ ఇస్తున్న నీలుస్వామి

నార్పల, ఫిబ్రవరి 1: రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ కృషి చేసి చంద్రబాబునాయుడును సీఎం చేద్దామని ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు అన్నారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ట్రైనర్ నీలుస్వామి ఆధ్వర్యంలో క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌చార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో జగన్ చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, క్లస్టర్ ఇన్‌చార్జిలు పీఎల్ లక్ష్మీనారాయణ, తలారి కుల్లాయప్ప, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసం డీఎస్సీ పేరుతో జగన్నాటకం

తెలుగు యువత నాయకుల మండిపాటు

సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం



సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెలుగు యువత నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 1: ఎన్నికల కోసమే సీఎం జగన్ డీఎస్సీ పేరుతో నాటకం ఆడుతున్నారని తెలుగు యువత నాయకులు మండిపడ్డారు. నిరుద్యోగులపై నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా తెలుగుయువత ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐరన్ బ్రిడ్జి సర్కిల్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడుపూటి నారాయణస్వామి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ఎలాంటి నోటిఫికేషన్లు విడుదల చేయకుండా ఎన్నికల నేపథ్యంలో 6100 డీఎస్సీ పోస్టులు ఇచ్చి మెగా డీఎస్సీ అంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కృష్ణ, నవీన్, భరత్, హరీష్‌రెడ్డి, చల్లా నాయుడు, ఆనంద్, నాగార్జున, నాగేంద్ర, దస్తగిరి, గణేష్, గంగాధర్, హరి, సూరి, బాషా తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న రూరల్ డీఎస్పీ, సీఐ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1: నగర శివారులో గత నెల 29న జరిగిన యువకుడి హత్య కేసులో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. గార్లదిన్నె మండలం జంబులదిన్నె కొట్టాల గ్రామానికి చెందిన సుగాలి రాజేష్ నాయక్‌ను దారుణంగా హతమార్చారు. ఈ కేసులో అనంతపురం రూరల్ పోలీసులు గురువారం బెస్త ఆంజనేయులు అలియాస్ వీరాంజనేయులును అరెస్ట్ చేశారు. కక్కలపల్లిలోని టమోటామండీలో పనిచేస్తున్న రాజేష్‌నాయక్‌కు, ఆటో డ్రైవర్‌గా ఉన్న ఆంజినేయులుకు పరిచయం ఏర్పడింది. తరచూ అంజినేయులు ఇంటికెళ్లే రాజేష్‌నాయక్ అతని భార్యతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. దీంతో రాజేష్‌నాయక్‌ను అంజినేయులు అంతమొందించాలనుకున్నాడు. ఆ క్రమంలో కత్తిని కొనుక్కుని ఇంటిలో ఉంచుకున్నాడు. గత నెల 29న తెల్లవారుజామున తన ఇంటిలోని వాష్‌రూమ్‌లో రాజేష్‌నాయక్ ఉండగా ఆంజినేయులు చూశాడు. దీంతో తన భార్యతో వివాహేతర సంబంధం నిజమేనని భావించి అదేరోజు మధ్యాహ్నం సప్తగిరి సర్కిల్‌లో రాజేష్‌ను కలిశాడు. మద్యం తాగారు. రాత్రి సీవీ రామన్ డిగ్రీ కళాశాల వెనుకభాగంలోని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లాడు. రాజేష్‌నాయక్ మద్యం మత్తులో ఉండగా ఆంజినేయులు తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. కత్తిపోట్లతో తీవ్ర రక్తగాయాలకు గురైన రాజేష్‌నాయక్ మృతి చెందాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన ఆంజినేయులు బైక్‌ను, కత్తిని ఓ ఇటుకల బట్టీ వద్ద ఉన్న కంపచెట్లలో దాచి పెట్టాడు. ఈనెల 31న పోలీసులు తనకోసం వెతుకుతున్నారని, కక్కలపల్లి వీఆర్వో ఆశిక్ వద్దకు వెళ్లి తాను నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. వీఆర్వో నేరవివరాలతో స్టేట్‌మెంట్ తయారు చేసి రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి వద్ద హాజరుపరిచారు. కోర్టులో హాజరు పరచగా 14రోజుల రిమాండ్ విధించారు. సీఐ రామక్రిష్ణారెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు కృష్ణప్ప, గిరిబాబు, కానిస్టేబుళ్లు రాజశేఖర్, శివ, జయరాం, పాండవల బృందాన్ని డీఎస్పీ అభినందించారు.

పీఆర్ ఎస్ఈ బాధ్యతల స్వీకరణ

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 1: జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈగా ఎం ఈరాస్వామి ఆ శాఖ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆ శాఖ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ శాఖ ఈఈలు చంద్రశేఖర్, కేవీ ప్రసాద్, శ్రీనివాసులు, డీఈఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, పీఏ రాజేంద్రప్రసాద్, రసూల్, చంద్రకుమార్, ఏఓ గీత, సహాయ ఇంజనీర్లు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

పురోగతితో పశుసంవర్ధక శాఖకు మూడో స్థానం

జేడీ సుబ్రహ్మణ్యంకు అవార్డు ప్రదానం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 1: రాష్ట్ర స్థాయిలో శాఖాపరంగా పురోగతిలో అనంతపురం పశుసంవర్ధకశాఖ మూడోస్థానం దక్కించుకుంది. ప్రతి ఏడాది గణతంత్రదినోత్సవం సందర్భంగా శాఖాపరంగా పురోగతి సాధించిన జిల్లాల ఉన్నతాధికారులకు అవార్డులు ప్రదానం చేసి సన్మానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మూడోస్థానం పొందినందుకు గురువారం విజయవాడలోని పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో మంత్రి అప్పలరాజు చేతుల మీదుగా జేడీ సుబ్రహ్మణ్యంకు అవార్డు ప్రదానం చేయడంతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. అదేవిధంగా అనంతపురం పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్రకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. మంత్రి అప్పలరాజు అవార్డు ప్రదానం చేశారు.

న్యాయపోరాటంలో సమిధలు కావొద్దు

● బహుజన లాయర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 1: న్యాయ పోరాటంలో సమిధలు కావద్దని బహుజన లాయర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప సూచించారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసులో గెలుపొందిన వారికి న్యాయంస్థానం అండగా నిలుస్తుందన్నారు. అయితే న్యాయవాదులు బాధితుల తరపున వాదిస్తున్న సమయంలో ఒక్కోమారు కేసును వెనక్కి తీసుకుంటున్నారన్నారు. దీనివల్ల నిజమైన కేసులు కూడా నీరుగార్చం అవుతున్నాయని ఆవేదన చెందారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పద్మావతి, నాయకులు వెంకటేసులు, విజయలక్ష్మి, ప్రియాంక, అక్కులప్ప, సురేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల అణచివేత దుర్మార్గం: గేయానంద్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, అంగన్‌వాడీల ఉద్యమాలను అణచివేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్సీ గేయానంద పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద 2వ రోజు ఆర్థిక బకాయిల సాధన కోసం చేస్తున్న రిలే దీక్షలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు లక్షల మందికిపైగా 42 రోజులపాటు ఆందోళన చేస్తే వారికి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు కల్పించలేదన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు బకాయిపడిన సొమ్మును చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామప్ప, రాఘువేంద్ర, హనుమంతరెడ్డి, అర్జున్, రవికుమార్, రాఘురామయ్య, సంజీవ్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ లో ఓల్టేజీ, కోతలపై రైతుల కన్నెర్ర

మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ ముట్టడి.. రోడ్డుపై బైఠాయించి ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 1: కరెంట్ కోతలు, లోఓల్టేజీతో కళ్లేదుటే పంటలు ఎండుతుంటే రైతులు కన్నెర్ర చేశారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఏకంగా సబ్‌స్టేషన్‌ను ముట్టడించడంతోపాటు దాదాపు 2గంటలపాటు రహదారిని దిగ్బంధించారు. గురువారం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ వద్దకు చంద్రాచెర్ల, దాదులూరు, కుర్లపల్లి, తండా గ్రామాలకు చెందిన పలువురు రైతులు పెద్దఎత్తున చేరుకుని కరెంట్‌కోతలు, లోఓల్టేజీపై సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. సిబ్బంది లేకపోవడంతో వారికి సరైన సమాధానం చెప్పేవారు లేకపోవడంతో అక్కడే మామిళ్లపల్లి, ధర్మవరం ప్రధానరహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్దఎత్తున వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. స్థానిక సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏడీ నాగేంద్ర, ఏఈ జానకిరామయ్యతో కలిసి హుటాహుటినా రైతుల వద్దకు వచ్చారు. రైతులు అధికారులను చుట్టుముట్టి కోతలు, లోఓల్టేజీపై నిలదీశారు. ట్రాన్స్‌కో ఏడీ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా కరెంట్ సరఫరా చేస్తామని ఇక నుంచి ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు రాస్తారోకోను విరమించారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



లిఖిత



సత్యప్రకాష్



ద్వారకానాథ్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1: జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 4వతేదీ నుంచి ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించే 73వ జూనియర్ బాస్కెట్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆంధ్రా బాలికల జట్టు తరపున లిఖిత, బాలుర జట్టు తరపున సత్యప్రకాష్, ద్వారకానాథ్‌రెడ్డి ప్రాతినిథ్యం వహించనున్నారని బాస్కెట్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు.

బేస్‌బాల్ పోటీలకు హరీష్, లింగేశ్వర్



హరీష్



హరీశ్వర్

అనంతపురం క్లాక్‌టవర్: జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని కళ్యాణ్‌లో ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించే 2వ సీనియర్స్ బేస్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున జిల్లాకు చెందిన దేవరకొండ హరీష్, లింగేశ్వర్ ప్రాతినిథ్యం వహించనున్నట్లు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాకే ధను తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు, కోచ్ జగదీష్‌లకు బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి జాతీయస్థాయి క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1: జాతీయస్థాయి క్రికెట్ పోటీలు ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. మొత్తం వివిధ రాష్ట్రాల నుంచి 16 జట్లు పాల్గొంటాయని తెలిపారు.

కిట్లు పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1: కబడ్డీ క్రీడాకారులకు ఉచితంగా కిట్లు పంపిణీ చేశారు. శాప్ కోచ్ నరేష్‌కుమార్ గౌడ్ ఆర్థిక సహకారంతో జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియం షటిల్ క్రీడాకారుల సంఘం అధ్యక్షుడు రవీంద్రరెడ్డి చేతుల మీదుగా గురువారం స్థానిక డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో కిట్లు, దుస్తులు కబడ్డీ క్రీడాకారులకు అందజేశారు.

'ప్రజలకు అందుబాటులో ఉండాలి'

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 1: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. గురువారం మండలంలోని కక్కలపల్లి కాలనీ-2 సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు.

4న ఆత్మీయ సమ్మేళనం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 1: ఏపీ నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌నగర్‌లోని జయమణెమ్మ కల్యాణమండపంలో నిర్వహించే ఈ సమ్మేళనానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాయీబ్రాహ్మణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బహుమతుల ప్రదానం

శింగనమల ఫిబ్రవరి 1: టీడీపీ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించి నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన హర్షవర్థన్, నవీన్ కుమార్‌లకు గురువారం బహుమతులు అందజేశారు. ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటమడుగు కేశవరెడ్డి , రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు బహుమతులు అందజేశారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా చేపట్టండి

● కమిషనర్ ఆదేశం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1: ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని నగర కమిషనర్ మేఘస్వరూప్ హెచ్చరించారు. గురువారం కౌన్సిల్ హాల్‌లో శాశ్వత స్థల హక్కు పథకం ద్వారా లబ్ధిదారులకు రిజిష్టర్డ్ పట్టాలు మంజూరు చేసే విషయంపై వార్డు అడ్మిన్, రెవెన్యూ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, తహసీల్దార్ బాలక్రిష్ణన్, కార్యాలయ సిబ్బంది, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు, ఫిబ్రవరి 1: తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గురువారం ఎంపీపీ హేమలత అధ్యక్షతన సమావేశం సాగింది. సమావేశానికి ప్రజా ప్రతినిధుల భర్తలు హాజరయ్యారు. కోరం లేకపోయినా సమావేశాన్ని కొనసాగించారు. సమస్యలపై చర్చించకుండానే కార్యక్రమాన్ని ముగించారు.

ఘర్షణలకు దిగితే కేసులు: డీఎస్పీ

శింగనమల, ఫిబ్రవరి 1: రానున్న ఎన్నికల్లో ఘర్షణలకు దిగితే కేసులు తప్పవని డీఎస్పీ వెంకటశివారెడ్డి హెచ్చరించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని పెద్ద జలాలపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో సంయమనం పాటించాలన్నారు. ఆయన వెంట సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బంది ఉన్నారు.

ఆటో బోల్తా... ముగ్గురికి తీవ్రగాయాలు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 1: మండలంలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో గురువారం ఆటో బోల్తాపడ్డ సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు. ఆటోలో 15మంది కూలీలు కరివేపాకు కోసేందుకు శింగనమల మండలం అలంకరణపేట నుంచి ముచ్చుకోటకు వచ్చి పని పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో ఆటో పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన ఉన్న గుంతలో ఆటో బోల్తాపడింది. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాయదుర్గంలోనే ఉంటా: కాలవ



టీడీపీలోకి చేరిన సిద్దాపురం వైసీపీ కార్యకర్తలతో కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 1: తాను రాయదుర్గం నియోజకవర్గం నుంచే శాసనసభకు పోటీ చేస్తానని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం ఆన రాయదుర్గం నివాసంలో హెచ్ సిద్దాపురం తండాకు చెందిన పలువురికి కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పలురకాల వదంతులు రావడం సర్వసాధారణమన్నారు. తాను ఎంపీగా వెళ్తానని వస్తున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దన్నారు. మరో 15 ఏళ్లు ఇక్కడే ఉంటానని, అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని తనను చంద్రబాబు పంపించారని కాలవ గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను తాను గెలిచాక పూర్తి చేస్తానన్నారు. ఎవరూ ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని, రాయదుర్గంలో నిలిచేది, గెలిచేది తానే అని ప్రకటించారు. మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, మకాసి వెంకటేశులు, సంజునాయక్, డీ నాగరాజు నాయక్, డీ తిప్పేస్వామినాయక్, డీ కృష్ణనాయక్, డీ రామవల్లినాయక్, డీ మంజునాయక్, డీ దంజునాయక్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు



ఓటరు జాబితాపై ఈఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న ఉమామహేశ్వర నాయుడు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 1: ఓటరు జాబితాలో తప్పులపై కళ్యాణదుర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి ఓట్లు తొలగించకుండా అలానే ముద్రించడం లాంటి వాటిని ఈఆర్వో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 67వ పోలింగ్ కేంద్రంలో ఉన్న 20 ఓట్లు, 65, 66 కేంద్రాల్లో కూడా ఉన్నాయని, వైసీపీ నాయకులు కావాలని వీటిని రెండు మూడు చోట్ల ఎక్కించారని ఆరోపించారు. ఈఆర్వో రాణి సుశ్మిత స్పందించి మరో తనిఖీ చేసి తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, పార్లమెంట్ కార్యదర్శి తలారి సత్తి, మురళి, కొల్లప్ప, బిక్కి గోవిందరాజులు, వీరుపాక్షి, భోగేష్ కుమార్, కామక్కపల్లి, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్‌యూబీతో సమస్య తీవ్రం: సీపీఐ



డీఆర్ఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న జగదీశ్, సీపీఐ నాయకులు

గుంతకల్లు, ఫిబ్రవరి 1: పట్టణంలోని ధర్మవరం గేటు వద్ద రైల్వే అధికారులు చేపట్టిన రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) వల్ల పట్టణ ప్రజలకు సమస్య తీవ్రతరమౌతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ జగదీశ్ అన్నారు. గురువారం ఉదయం స్థానిక సీపీఐ నాయకులు డీఆర్ఎం వినీత్ సింగ్‌తో భేటీ అయ్యారు. జగదీశ్ మాట్లాడుతూ గుంతకల్లులో నట్టనడుమ ధర్మవరం గేటు ప్రాంతం ఉందని, ఇక్కడ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉన్నందున రైళ్లు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్య ఎక్కువైందన్నారు. రైల్వే అధికారులు ప్రస్తుతం ధర్మవరం గేటును తొలగించి అక్కడ లైన్ కిందనుంచి వంతెనను ఏర్పాటుచేయడానికి సంకల్పించిందన్నారు. కానీ తగిన ఎత్తులో నిర్మించడంలేదని, గతంలో ప్రతిపాదించిన మేరకు వంతెనను నేరుగా నిర్మించకుండా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పక్క రోడ్డులోకి మళ్లించి వంకరగా నిర్మించడానికి నిర్ణయించారన్నారు. దీనివల్ల పట్టణ ప్రజలకు సమస్య తీరకపోగా, మరింత తీవ్రమౌతుందన్నారు. ఒకసారి ధర్మవరం గేటును సందర్శించాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘం జిల్లా నాయకుడు బీ గోవిందు, నియోజకవర్గ కన్వీనరు వీరభద్రస్వామి, నాయకులు గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాము పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు అమలయ్యేనా?

● సీనియర్ అసిస్టెంట్‌ను కమిషనర్ రిలీవ్ చేసేనా?

తాడిపత్రి, ఫిబ్రవరి 1: మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషాను 24గంటల్లోపు రిలీవ్ చేయాలని కమిషనర్ రవిని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను కమిషనర్ పాటించేనా, రాజకీయ ఒత్తిళ్లతో నాన్చుడి ధోరణి అవలంబిచేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అందుకు కారణం చాంద్‌బాషాపై పలుమార్లు టీడీపీ నాయకులు, కౌన్సిల్ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే... 013లో నంద్యాల మున్సిపాలిటీ నుంచి తాడిపత్రికి చాంద్‌బాషా బదిలీపై వచ్చారు. 2019లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు బదిలీపై వెళ్లారు. అప్పట్లో మెడికల్ గ్రౌండ్స్ కింద తిరిగి తాడిపత్రికి డిప్యుటేషన్‌పై వచ్చారు. 2021లో టీడీపీ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత చాంద్‌బాషాపై అంతర్గత విచారణ జరిపింది. విచారణలో ఆయనపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో రిలీవ్ చేయాలని సీడీఎంఏ, ఆర్‌డీఎంఏలను సూచిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తీసుకురావడంతో చివరికి నంద్యాల మున్సిపాలిటీకి బదిలీ చేశారు. అక్కడి నుంచి తిరిగి తాడిపత్రి మున్సిపాలిటీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. డిప్యుటేషన్‌పై పనిచేస్తూ ఒకపార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నాడని సీనియర్ అసిస్టెంట్ అయినా నిబంధనలకు విరుద్ధంగా అన్నిశాఖల్లో జోక్యం చేసుకుంటూ మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోయింది. కొన్నిరోజుల క్రితం సీనియర్ అసిస్టెంట్‌కు సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన జాబితాను టీడీపీకి చెందిన కొందరు కలెక్టర్ గౌతమితోపాటు ఎన్నికల కమిషనర్, ఆర్‌డీఎంఏ, సీడీఎంఏలకు పంపించారు. దీనిపై విచారణ జరిపిన కలెక్టర్ సమగ్ర వివరాలతో కూడిన నివేదికను పంపాలని కమిషనర్‌ను ఆదేశించారు. వచ్చిన నివేదిక అనుసరించి సీనియర్ అసిస్టెంట్‌ను 24గంటల్లోపు రిలీవ్ చేయాలని కలెక్టర్ ఆదేశించింది.

బడి వేళలకు బస్సులు నడపండి

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 1: నియోజకవర్గంలో విద్యార్థులు బడికి వెళ్లి సమయానికి అనుగుణంగా బడి బస్సులను నడపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి, అధ్యక్షుడు అంజినేయులు, బంగి శివ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో విద్యార్థులకు అనుగుణంగా బస్సులను నడపాలని బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కనీసం విద్యార్థులకు బడి బస్సు ఏర్పాటు చేయలేని దౌర్భాగ్య పరిస్థితి రాయదుర్గంలో దాపురించిందన్నారు. గతంలో విద్యార్థులకు ఎనిమిది బస్సు సర్వీసులు ఉండేవన్నారు. ప్రస్తుతం ఐదు బస్సులకే కుదించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఒకే బస్సులో 150 నుంచి 200 మంది విద్యార్థులను తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు అనుగుణంగా బడిబస్సులను నడపాలని లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అభి, మాంతేష్, యోగేంద్ర, జోసెఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

అన్ని వర్గాలను మోసగించిన ప్రభుత్వం: ఎమ్మెల్యే కేశవ్



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

ఉరవకొండ, ఫిబ్రవరి 1: వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. మండలంలోని షైలారం పల్లి, రాచేపల్లి, కౌకుంట్ల గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సొంత పంచాయతీ కావడంతో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం మన్నారు. మాజీ సర్పంచు ఎర్రిస్వామి, ఎంపీటీసీలు దేవరాజు, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు నారాయణస్వామి, వెంకటరమణ, ప్రసాద్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటన

తాడిపత్రి: మండలంలోని ఇగుడూరులో గురువారం టీడీపీ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందన్నారు. ప్రజా సంక్షేమం టీడీపీ వల్లనే సాధ్యమవుతుందని ప్రజలకు తెలియజేశారు.



ఇగుడూరులో అశ్మిత్ రెడ్డికి హారతిపట్టి కుంకుమ పెడుతున్న మహిళ

చంద్రన్నతోనే సంక్షేమం

పామిడి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ అన్నారు. పట్టణంలోని 6,7వ వార్డులలో గురువారం సాయంత్రం టీడీపీ, జనసేన పార్టీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్రం వైసీపీ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. ప్రజల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. పట్టణంలో ఎక్కడ చూసిన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బండారు ఆనంద్, మాజీ డీలర్ టపాల్, తిమ్మప్ప, రాఘవ, జనసేన మండల కార్యదర్శి వడ్డే రాము, రామకృష్ణ, దాదు, హరీష్, నాగార్జున, డ్రైవర్ శివ, రామాంజనేయులు, ఓబుళయ్య, భాస్కర్, పురుషోత్తం పాల్గొన్నారు.



బ్రహ్మసముద్రంలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు



పామిడిలో కరపత్రాలు పంచుతున్న వెంకటశివుడు యాదవ్, నాయకులు

సూపర్‌సిక్స్ పథకాలతోనే ప్రజలకు లబ్ధి

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలో టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. వారు ప్రజలను కలిసి 2024 సంవత్సరంలో టీడీపీ అధికారంలోకి వస్తే పథకాల ద్వారా జరిగే లబ్ధిని వివరించి రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు, బూత్‌లెవెల్ ఏజెంట్ పరమేష్, ఐటీడీపీ మండల కోఆర్డినేటర్ ఎం లోకేష్, వడ్డే తిమ్మప్ప పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం



బోరుబావికి మోటారు అమర్చి నీటిని విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, ఫిబ్రవరి 1: మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను గ్రామస్థులు యువచైతన్య యాత్రలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఆయన స్పందించారు. కొద్దినెలల క్రితం టీడీపీ నాయకులు చొరవతీసుకొని గ్రామ పంచాయతీ నిధులతో బోయరెడ్డిపల్లిలో బోరుబావి తవ్వించారు. మోటార్ బిగించి నీళ్లు సరఫరా చేస్తే టీడీపీ నాయకులకు పేరు వస్తుందని మోటార్ ఏర్పాటు చేయడంలో వైసీపీ నాయకులు అడ్డుకున్నారని గ్రామస్థులు జేసీపీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన సర్పంచు కంబగిరిస్వామి, టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డిలతో మాట్లాడారు. తక్షణమే బోరుబావికి మోటార్ అమర్చేలా చేసి గ్రామస్థుల తాగునీటి కష్టాలు తీర్చాలని తెలిపారు. సాయంత్రానికి బోరుబావికి మోటార్ అమర్చి నీటిని విడుదల చేశారు. బోయరెడ్డిపల్లి, చింతలాయపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ టాయిలెట్‌లో సరుకులు

● లబ్ధిదారులకు పంచకుండా దాచిన సిబ్బంది

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 1: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందజేయాల్సిన పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు టాయిలెట్ గదిలో దాచారు. కంబదూరు మండలం ములకనూరు గ్రామంలో ఈ వ్యవహారం గురువారం బయట పడింది. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉన్న సమయంలో గ్రామ సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కేంద్రం నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. వారు సమ్మె విరమించిన అనంతరం తిరిగి అప్పగించారు. గ్రామంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో పౌష్టికాహారం పంపిణీ జరగకపోవడంతో అప్పట్లో పనిచేసిన యానిమేటర్, మహిళా పోలీస్, వీఆర్‌ఏలను లబ్ధిదారులు పలుమార్లు ప్రశ్నించారు. స్టాక్‌ను అంగన్‌వాడీ కార్యకర్తలకే అప్పగించామని, వారినే అడిగాలని సచివాలయ సిబ్బంది సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు తెలియదని చెప్పడంతో.. గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది గురువారం అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి ఆరాతీశారు. అనుమానం వచ్చి టాయిలెట్ గది తాళాలను పగులగొట్టారు. అందులో పది బియ్యం ప్యాకెట్లు, 20 ఆయిల్ ప్యాకెట్లు, 20 గోధుమ పిండి ప్యాకెట్లు, 10 కందిబేడలు ప్యాకెట్లు దొరికాయి. ఈ వ్యవహారంపై సీడీపీవో వనజా అక్కమ్మ విచారణ చేపట్టారు.

నాలుగేళ్లయినా ఒక్క రోడ్డు వేయలేని జగన్

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 1: నాలుగేళ్లయినా ఒక్క రోడ్డు కూడా సీఎం జగన్ మోహన్ రెడ్డి వేయలేకపోయాడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి విమర్శించారు. గురువారం శెట్టూరు మండలం ములకలేడు, గోవిందనగర్, రంగయ్యపాల్యం గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. నాయకులు ఆర్‌జీ శివశంకర్, కవిత, గురుప్రసాద్, తిప్పారెడ్డి, రంగప్ప, లింగారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం

యల్లనూరు, ఫిబ్రవరి1: టీడీపీ ఆధ్వర్యంలో క్లస్టర్, బూత్‌లెవల్ సభ్యులకు గురువారం స్థానిక అంజనేయస్వామి ఆలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా శిక్షణా నిర్వాహకురాలు శ్వేత హాజరై పలు విషయాలను వివరించారు. కార్యక్రమానికి క్లస్టర్ ఇన్‌చార్జి చల్లా చంద్రశేఖర్‌నాయుడు, యూనిట్ సభ్యులు రామకృష్ణారెడ్డి, శివ, శరత్‌చంద్రనాయుడు, సంజీవరాయుడు హాజరయ్యారు.

పుట్లూరు: వచ్చే ఎన్నికల్లో టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ జిల్లా శిక్షణ నిర్వాహకురాలు శ్వేత సూచించారు. మండలకేంద్రంలో గురువారం టీడీపీ నాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి క్లస్టర్ ఇన్‌చార్జిలు ఆయా గ్రామాల్లో తిరిగి చంద్రబాబు చేపట్టే పథకాలను వివరించి, ఆ కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి నమోదు చేయాలని సూచించారు.

మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభం

కుందుర్పి, ఫిబ్రవరి 1: మండలంలోని మందలపల్లి గ్రామంలో నాబార్డు, ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంటును గురువారం డీడీఎం అనురాధ, ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాబార్డు డీడీఎం అనురాధ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నాబార్డు ఏఎఫ్ ఎకాలజీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రజలందరు ఐకమత్యంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అతావుల్లా, ఎంపీటీసీ కెంచమ్మ, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు తిప్పేస్వామి, ఏఎఫ్ ఎకాలజీ సంస్థ మురళీకృష్ణ, భాస్కర్‌బాబు, రిజ్వానా, ఖలీల్, వీరభద్రారెడ్డి, శంకర్ నారాయణ, నాగరాజు, ఎంటీఎల్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ చేతివాటం

కుందుర్పి, ఫిబ్రవరి 1: మండలంలోని మహంతపురం సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ చేతివాటానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. గురువారం విద్యార్థికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయానికి వెళ్లిన వ్యక్తితో రూ.110 ఫీజు వుండగా రూ.300 అదనంగా తీసుకున్నట్లు బాధితుడు తెలిపాడు. సచివాలయంలో ఆధార్ సేవలు కొనసాగుతుండటంతో ఆధార్ కార్డుల కోసం అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపించారు. మ్యుటేషన్ ఫైల్స్ కోసం వచ్చే వారితో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు కొందరు అంటున్నారు. సదరు డిజిటల్ అసిస్టెంట్‌పై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

డీజిల్ అక్రమ రవాణాపై కేసు నమోదు

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 1: కర్ణాటక నుంచి ఆంధ్ర ప్రాంతంలో గ్రానైట్ క్వారీలకు అక్రమంగా 600 లీటర్ల డీజిల్ సరఫరా చేస్తున్న నల్లక్కి రాధాకృష్ణను సెబ్, గుమ్మఘట్ట పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. డీజిల్ స్వాధీనం చేసుకుని డీసీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎంఎం వెంకటేశ్వర్లు తెలిపారు. రంగసముద్రం వద్ద గురువారం వేకువజామున వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి బొలెరో వాహనంలో 600 లీటర్ల డీజిల్ రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

బాలుడి అదృశ్యం



లక్ష్మీనారాయణ (ఫైల్)

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 1: మండలంలోని భోగసముద్రం గ్రామానికి చెందిన 17సంవత్సరాల లక్ష్మీనారాయణ జనవరి 22నుంచి కనిపించడం లేదని రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796863, 9440958000 నెంబర్లకు ఫోన్‌చేయాలని సీఐ కోరారు.

మీ అవినీతిని సీరియల్‌లా వివరిస్తా

● ఎమ్మెల్యే కాపుపై వైసీపీ నాయకుడి పోస్టులు



ఎమ్మెల్యేపై కేశవరెడ్డి పెట్టిన పోస్టు

కణేకల్లు, ఫిబ్రవరి 1: నువ్వు ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి ఏమేమి అవినీతి చేశావో సీరియల్‌లాగా నీ చిట్టా అంతా వివరిస్తానని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిపై వైసీపీ నాయకుడు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. ఇది అన్ని గ్రూపులలో హల్‌చల్ అవుతోంది. మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చెన్నకేశవరెడ్డి ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిపై బహిరంగంగా పోస్టులు పెట్టి ఆయన అక్రమాలను వివరించాడు. ప్రధానంగా తాను సొంత భూమిని ఇతరులకు విక్రయిస్తే అందులో లేఅవుట్ వేయడానికి రూ.25 లక్షలు ఎమ్మెల్యే తీసుకున్నాడని ఆయన ఆరోపించారు. సొంత పార్టీ నాయకులతోనే డబ్బు తీసుకుని ఎమ్మెల్యే ఎంత అవినీతిపరుడో నిరూపించుకున్నాడని ఆయన మండిపడ్డారు. ఇవన్నీ వాస్తవాలేనని తాను ఎక్కడైనా ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, అవినీతి చేయలేదని ఎమ్మెల్యే ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నాడా అని ఆయన సవాల్ విసిరారు.

ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వొద్దు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 1: ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులకు తావివ్వొద్దని ఆర్డీవో రాణి సుశ్మిత అధికారులను ఆదేశించారు. కళ్యాణదుర్గం రూరల్, అర్బన్‌లో ఉన్న బూత్ లెవెల్ అధికారులతో ఆర్డీవో కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పొప్పులను సవరించాలని, క్లైయిమ్స్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను జతపరచాలన్నారు. మున్సిపల్ కమిషనర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ ఉత్సవాలపై సమీక్ష

గుత్తిరూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని సేవాఘడ్‌లో 13వ తేదీ నుంచి నిర్వహించే సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలపై ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, డీటీడబ్ల్యూఓ రామాంజునేయులు గురువారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు హాజరయ్యే లక్షలాది మంది భక్తులకు ఎటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దారు, మహబూబ్ బాషా, ఎంపీడీఓ శివాజీ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సభ్యులు ఆర్ఐలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

కుందుర్పి, ఫిబ్రవరి 1: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమలమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో గ్రామ పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్, ఉపాధి హామీ, నాడు నేడు పనులకు సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులు, సర్పంచ్‌ల ఎదుట సమాచారాన్ని చదివి వినిపించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. కొందరు అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. వైస్‌ఎంపీపీ భీమిరెడ్డి, ఏవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 1: పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాల వద్ద నివాసముంటున్న హనుమన్న(42) అనే వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. హనుమన్న పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన నూతన ఇంటిని నిర్మించుకున్నాడని వాటి కోసం అప్పులు చేశాడన్నారు. విడపనకల్లు మండలం కొత్తకోటలో 88 సెంట్ల పొలంలో పంటలు సాగు చేశాడని వాటిలో కూడా నష్టం వచ్చిందన్నారు. దీంతో మనస్థాపం చెందిన హనుమన్న ఆదివారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడన్నారు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...



సురేష్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 1: పట్టణంలోని ఆలూరు రోడ్డులో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి బోయ సురేష్ (29) అనే యువకుడు మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. పట్టణంలోని శ్యాంసన్ పురంలో నివాసముంటున్న సురేష్ బెల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి వడలు తెస్తానని చెప్పి ఇంట్లో నుంచి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. ఎంతసేపటికి సురేష్ ఇంటికి రాకపోడంతో కుటుంబ సభ్యులు కంగారు పడ్డారు. ఉదయం ఆలూరు రోడ్డులో రోడ్డు పక్కన ఓ పోలంలో సురేష్ పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య భారతి, కొడుకు, కుతూరు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని అవుట్ సోర్సింగ్ ఉద్యోగి...,



శివానంద (ఫైల్)

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 1: వజ్రకరూరు గ్రామ సమీపంలో గురువారం రాత్రి ట్రాక్టర్‌ను ఢీకొని గుంతకల్లు మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బీ శివానంద (49) మృతి చెందాడు. పట్టణంలోని గంగానగర్‌లో నివాసముంటున్న శివానంద అతని సోదరి లక్ష్మీనరసమ్మతో కలసి ద్విచక్రవాహనంలో ఉరవకొండకు బయలుదేరారు. వజ్రకరూరు గ్రామ సమీపంలో ఆగి ఉన్న మొద్దుల ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శివానంద ముఖం ఛిద్రమైంది. లక్ష్మీనరసమ్మ స్వల్పంగా గాయపడింది. గాయపడిన వీరిని 108 వాహనం ద్వారా గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివానంద అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న మృతుడి భార్య నాగమణి, కుమారుడు, కుతూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బోరున విలపించారు. మున్సిపల్ ఇంజనీర్ గుర్రప్పయాదవ్, మున్సిపల్ సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులకు పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు

యాడికి, ఫిబ్రవరి 1: లారీ, బైక్ ఢీకొన్న సంఘటనలో శ్రీనివాసరెడ్డి, వెంకటరాముడు అనే ఇరువురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం పెన్నాసిమెంట్స్ సమీపాన ఉన్న రైల్వేగేట్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలమేరకు బోయరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, వెంకటరాముడు ద్విచక్రవాహనంపై తాడిపత్రి నుంచి గ్రామానికి వెళుతుండగా పెన్నాసిమెంట్ ఫ్యాక్టరీ సమీపాన ఉన్న రైల్వేగేట్ వద్ద లారీ ఢీకొన్నట్లు తెలిపారు. సంఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఇరువురిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఆటో బోల్తా

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 1: మండలంలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో గురువారం ఆటో బోల్తాపడ్డ సంఘటనలో ముగ్గురు గాయపడినట్లు ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు. ఆటోలో 15మంది కూలీలు కరివేపాకు కోసేందుకు శింగనమల మండలం అలంకరణపేట నుంచి ముచ్చుకోటకు వచ్చి పని పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సమయంలో ఆటో పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన ఉన్న గుంతలో ఆటో బోల్తాపడింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడికి గాయాలు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 1: పట్టణంలోని హిమగిరి రెస్టారెంట్ వద్ద సోమదాసు అనే వృద్ధున్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలమేరకు మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన సోమదాసు పట్టణంలో తోపుడుబండి పెట్టుకుని వ్యాపారం చేసేవాడు. రోజు మాదిరిగానే తోపుడు బండి తీసుకువెళుతున్న అతనిని హిమగిరి రెస్టారెంట్ వద్ద వెనుక వైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

తాడిపత్రి, ఫిబ్రవరి 1: స్థానిక రైల్వేస్టేషన్‌లో గురువారం తెల్లవారుజామున కర్ణాటకకు చెందిన రెండు సంచుల్లోని మద్యంబాటిళ్లను రైల్వేపోలీసులు స్వాధీనం చేసుకున్నారని విశ్వసనీయ సమాచారం. కొల్హాపూర్ నుంచి తిరుపతికి వెళుతున్న హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లో దిగిన ఇద్దరు వ్యక్తులు తీసుకువెళుతున్న బ్యాగులను పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో మద్యంబాటిళ్లు ఉండడంతో నిందితులను అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఉరవకొండ: మండలంలోని వై రాంపురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక మద్యాన్ని సెబ్, ఇంటెలిజెన్స్ బృందం సభ్యులు పట్టుకున్నారు. ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 35 బాక్సుల టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని మద్యంనుతెప్పించిన నరసింహులు అనే వ్యక్తిని అరెస్టు చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన చిట్టెమ్మ(35) అనే మహిళ కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిట్టెమ్మకు మూడు సంవత్సరాల నుంచి కడుపునొప్పి తరచూ వస్తుండేదన్నారు. గురువారం కడుపునొప్పి అధికం కావడంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా వుందని వైద్యులు తెలిపారు.

'ఓటరు జాబితాలో పారదర్శకత ఏదీ?'

ఉరవకొండ, ఫిబ్రవరి 1: ఓటర్ల జాబితాలో పారదర్శకత ఏదీ అని పలు పార్టీల నాయకులు ప్రశ్నించారు. మరణించిన, డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించకుండా అలాగే ఉంచారని టీడీపీ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. పారదర్శకంగా ఓటర్ల జాబితా ఎక్కడ ఉందని ప్రశ్నించారు. డిసెంబర్ 9 తర్వాత నమోదు చేసుకున్న ఓటర్ల పేర్లు తుది జాబితాలో లేవని ఏఈఆర్వో దృష్టికి తీసుకెళ్లగా అనుబంధ ఓటర్ల జాబితాలో వస్తారని తెలిపారు. బెళుగుప్పలో ఒకే పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పోలింగ్ కేంద్రంలోకి పోవాలన్నా, రావాలన్నా ఒకే మార్గం ఉందని పోలింగ్ కేంద్రాల మార్పుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు మల్లికార్జున, తిప్పయ్య కోరారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో కర్నూలు జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్లు శ్రీధర్ మూర్తి, ఓబులేశు పూలమాలలతో సత్కరించారు. టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్, గోవిందు, మల్లికార్జున, తిప్పయ్య, రాము, తిమ్మప్ప, సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, కాంగ్రెస్ శ్రీన, ఓబులేశు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు